# కథలు రాస్తాను

ప్రసిద్ధ రచయితలు ఎందరో ఉన్న మా ఊరికి మరొక రచయిత వచ్చాడంటే సంతోషమే. ఇంతమంది గొప్ప రచయితలు ఉన్నందుకు విశాఖపట్నం ఒక ప్రధాన పర్యాటక కేంద్రమే కావలసింది. కానీ, ఇది తెలుగుదేశం. గుర్రప్పందేలకీ, చవకబారు సినిమాలకీ, పేకాటలకీ, రాజకీయ పదవులకీ, షేర్ మార్కెట్‌లకీ ఎంత దూరమున్నా ఎగబడతారు కానీ, ఒక రచయితనో, ఒక చిత్రకారుడినో, ఒక గాయకుడినో, ఒక సంగీతవేత్తనో, ఒక క్రీడాకారుడినో పొరుగున ఉన్నా పోయి చూడరు. కథలు అంటే, అందులోనూ కథాశిల్పం పట్టు తెలిసిన రచయితలంటే పడిచచ్చే మా స్నేహితుల్లో ఇంకా ఆ ఆకర్షణ మిగిలింది. యువరచయితలు కొందరు చూట్టానికి ఇంటికి వచ్చారంటే ఇంక చెప్పాలా? అట్లా నలుగురు స్నేహితులను వెంటబెట్టుకుని ఓ సాయంత్రం నా మీద దాడి చేయాటానికే అన్నట్టు వచ్చాడో యువ రచయిత.

మా పెద్దమ్మాయి తార పెళ్లి సంబంధం పని మీద వస్తున్న స్నేహితుని కోసం ఆ సాయంత్రం విమానాశ్రయానికి వెళ్లే హడావిడిలో ఉన్నాను. ఇదిగో గంటలో వచ్చేస్తాను నాన్నా అని మా పెద్దమ్మాయి కారు తీసుకుని వెళ్లింది. ఆమె వెళ్లి దాదాపు రెండుగంటలు కావస్తున్నది. ఇంకా తిరిగి రాలేదు. మా ఆవిడ ఆఫీసునించి వచ్చేవరకు ఆగే వ్యవధి లేదు. మా బుజ్జాయికి ఫోన్ చేశాను. డ్రైవర్‌ని వేరే పనిమీద పంపిచాడంట. కారు నువ్వు వచ్చి తీసుకుంటావా, నన్ను రమ్మంటావా అని అడుగుతున్నాడు. నువ్వు వస్తే సంతోషం అన్నాను. అట్లా ఫోన్ పెట్టానో లేదో ఇదుగో వీళ్లు వచ్చారు.

కొత్తగా వచ్చిన ఆ యువ రచయిత పేరు సత్యమూర్తట. ఆ పేరుతో కథకుడు ఎవరూ ఉన్నట్టు లేదే అన్నాను. అతడు నవ్వి ఊరుకున్నాడు. ఆ నవ్వులోనే అర్థమయింది అతడి గడుసుతనం. ఏదన్నా కలం పేరుతో రాస్తున్నాడో ఏమో. అట్లాంటిది ఏదన్నా ఉంటే దానంతటదే మాటల్లో బయట పడుతుందిలే అని ఇతర వివరాలకోసం ఒత్తిడి చేయలేదు. క్షుద్ర సాహిత్యం పడగ ఎత్తిన ఒక ఉధృత దశలో చాలమందికిమల్లె నేనూ పత్రికలు చూడటం మానేశాను. ఏమో, రాస్తున్నాడో ఏమో. పరిచయం చేసుకున్న మొదట్లోనే సత్యమూర్తి నా మీద సంధించిన మొదటి ప్రశ్న — కథలు ఎందుకు రాయడం మానేశారు అని. ఆ ప్రశ్నకు జవాబు చెప్పకుండా నేను దాటవేశాను. వేరే ముచ్చట్లలో పడ్డాం.

ఆయనతో వచ్చిన ఆ నలుగుర్లో ఒక్క నాగరాజు తప్ప మిగిలిన ముగ్గురు నాకు కొత్త. నాగరాజు మంచి రంగస్థలనటుడు. నాటకప్రయోక్త. మా ఊళ్లో రంగస్థల ప్రయోగాలకు అతడే చిరునామా. నలుగురూ వయసులో సత్యమూర్తి కన్నా పెద్దవాళ్ళలానే కనిపించారు. వాళ్లలో ముగ్గురు రచయితలేనట. భారీగా, దృఢంగా, ఎత్తుగా — వాళ్లను చూస్తే క్రీడాకారుల్లా ఉన్నారేతప్ప రచయితల్లా ఒక్కరూ కనిపించలేదు. సత్యమూర్తి వాళ్లల్లో చిన్నవాడిలాగా కనిపిస్తున్నాడు. బక్కపల్చగా, చిన్నగా, ఆడపిల్లలా ముద్దుగా ఉన్నాడు. వాళ్లల్లో వాళ్లు మాట్లాడుకుంటుంటే నాకు అర్థమయిందేమిటంటే, సత్యమూర్తి అంటే వాళ్లకు ప్రేమ, గౌరవం. కళ్ళద్దాలు, ఖాదీభాండార్‌లలో దొరికే గోధుమరంగు లాల్చీ, నీలం రంగు జీన్స్, ఆకుచెప్పుల్తో యూనివర్సిటీ హాస్టల్స్‌లో కనిపించే రిసెర్చి విద్యార్థిలా ఉన్నాడు. పెద్దవాడిలా కనిపించటానికా అన్నట్టు గెడ్డం, మీసాలు పెంచాడు. ఆ ముఖం చూస్తే సత్యమూర్తి వయసు పాతికేళ్లు ఉండవచ్చు ననిపించింది. పరధ్యానంగా ఉన్న అతడి చూపుల్లో ఆత్మాభిమానం, నిగ్రహం కనిపిస్తున్నాయి. మరో సమయంలో అయితే, వాళ్లతో ఎంత సేపన్నా కూర్చునేవాడినే.

పూర్వాశ్రమంలో కథలు రాయటంవల్లా, ఈనాటి ప్రముఖరచయితలు చాలామంది స్నేహితులు కావటంవల్లా, రచయిత మిత్రులు కలిసినప్పుడల్లా రాత్రింబగళ్లు మరచి కథారహస్యాలను చెప్పుకుంటూ గడపగల అభిరుచి ఉండటంవల్లా, రచయితగా తొలిరోజుల్లో కొన్నేళ్ళపాటు రచననే ఆకలి దప్పులుగా జీవించటంవల్లా ఇప్పటికీ ఒక మంచి రచనగాని, ఒక మంచి రచయితగాని కంటపడితే నాకు పండుగే.

కాఫీ హోటళ్లల్లో, సినిమా థియేటర్ల దగ్గర, పాత పుస్తకాలును అమ్మే కాలిబాటల

మీద, నాటక ప్రదర్శనల దగ్గర, గ్రంథాలయ ఆవరణల్లో, సాహితీ సమావేశాల్లో, స్నేహితుల ఇళ్ళల్లో, చివరికి కార్యాలయాల్లో కనిపించిన ప్రతి రచయితను పట్టుకుని, ఒక మంచి రచన గురించి చెప్పి, చదివించి, చర్చించి, పొగడి, పోట్లాడి, రచయితను కలుసుకుని, స్నేహాభిమానాలు కలబోసుకుని, రాత్రింబగళ్లు తిరిగి, తిని, తాగి, పాడి, ఏడ్చి అదే జీవితంగా సాహిత్య సాధన సాగించిన గతం మూలంగా ఇంకా కథలంటే, రచయితలంటే మోజు. కథలు రాయటం మానేసినప్పటినించీ ఆ మోజు మరింత పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు ఆనాటి నా రచయిత మిత్రుల పేర్లు పత్రికల్లో కనిపించటంలేదు. ఏమయి పోయారో ఆ రచయితలంతా? కర్మజీవుల్లా బతికిన ఆనాటి సంపాదకులు, సాహిత్య కళాసౌందర్యపు మణులు పొదిగిన ఆ పత్రికలు ఎక్కడ? ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహాలూ అని ఏకతార మీద పాడుకోవటం తప్ప చేసేదేముంటుంది?

మీరేం చేస్తారు అని అడిగాను సత్యమూర్తిని. అంటే జీవనభృతికి కథలు రాయటం మాత్రమే తెలుగుదేశంలో సరిపోదు కాబట్టి మరి బతుకుతెరువు కోసం ఏం చేస్తున్నారన్నది నా ఉద్దేశం.

కథలు రాస్తాను అన్నాడు సత్యమూర్తి.

ఆ ఒక్క సమాధానంతో అతడంటే నాకు అభిమానం ఏర్పడిపోయింది. నేను అతడి అభిమానినైపోయాను. తెలుగు రచయితకు ఇదివరలో లేనిది ఇప్పుడు కావలసింది అదే. గుండె మీద చెయ్యి వేసుకుని నేను రచయితను అని చెప్పుకోగల సత్తా, చేవ. వేరొకరయితే తను చేస్తున్న ఉద్యోగం గురించి సిగ్గుమాలి చెప్పుకుంటాడు. గట్టి పిండమే అనిపించింది. సత్యమూర్తి వృత్తి — కథలు రాయటమేనట. ఇంకోపని ఏదీ అతడికి చేతకాదట. ఆ సంగతి తెలీక ఢిల్లీలో ఒక కళాశాలలో ఏడాదిపాటు విద్యార్థులకు ఆంగ్లసాహిత్యం బోధించాడట. బాంబేలో ఒక ఇంగ్లీషు దినపత్రికలో రెండేళ్లపాటు ఉప సంపాదకుడిగా వెలిగించాడట. జీవితంలో ఏ ఉద్యోగానికీ తను పనికిరాడని తెలుసుకుని కథలు రాయటం ఒక్కటే తనకు చేతనయినందుకు అదృష్టంగా భావించి, ఏలూరులో ఉంటున్న తలిదండ్రుల దగ్గరకు వచ్చేశాడట.

అంతలో మా పెద్దమ్మాయి తార వచ్చేసింది.

"నా స్నేహితులు, అంతా రచయితలు, వాళ్లతో మాట్లాడు. కాఫీ ఏర్పాట్ల గురించి థామస్‌కి చెప్పాను, చూడు —" అని తారకు పని పురమాయించి వాళ్లను, ఉండమని చెప్పి, కారు వద్దన్నానని బుజ్జాయికి చెప్పమని, ఆ యువ రచయితల దగ్గర

వీడ్కోలు తీసుకుని వెళ్లిపోయాను. నాకన్నా మా అమ్మాయి తెలివైంది. ముఖ్యంగా కొత్తవాళ్లతో, ఈ తరం వాళ్లతో కలుపుగోలుతనంతో, వాళ్లు నోరు విప్పకుండా గంటలు గంటలు ఈ భూగోళం మీది ఏ విషయం గురించన్నా మాట్లాడగలదు, ఇంగ్లీష్‌లో, తెలుగులో, హిందీలో అనర్గళంగా. వసపిట్ట.

* * *

పాత పోస్టాఫీసు దగ్గర మహోఘనత వహించిన విక్టోరియా మహారాణి విగ్రహం వద్ద ఇద్దరు శ్వేతజాతి ముసలమ్మలతో సత్యమూర్తి ఓ సాయంత్రం కనిపించాడు. మూడురోజుల నించి ముసురు మూలంగా వాతావరణం చిత్తడి చిత్తడిగా ఉంది. చిన్నగా చినుకులు పడుతున్నాయి. పక్కనే కారు ఆపి వస్తారా అని అడిగాను. ఆ ఇద్దరు ముసలమ్మలు బాంబేలో ఇదివరకటి తన ఎడిటర్ పంపిస్తే ఇక్కడకు వచ్చారట. వాళ్లల్లో ఒకామెకు ఈ ఊళ్లో చిత్రకారులను చూడటం, వాళ్ల చిత్రాలను సేకరించటం పనట. రెండో ఆమె తెలుగు నేర్చుకుంటున్నదట. త్యాగరాజు కీర్తనల గురించి విని గత ఏడెనిమిదేళ్లుగా ఆమె త్యాగరాజ ఆరాధనోత్సవాలకు పదిహేనురోజులు ముందు వచ్చి, ఓ నెల దినాలు మద్రాసులో గడిపి వెళ్తున్నదట. ఇప్పుడామెకు తెలుగు నేర్చుకోవాలని బుద్ధి పుట్టిందట. కర్ణాటక సంగీతంతో ఆమెకు పరిచయం ఉందట. తను త్యాగరాజ కీర్తనల మీద రాయ తలపెట్టిన ఉద్గ్రంథం కోసం తెలుగు నేర్చుకోటానికి విశాఖపట్నం ఎంచుకుందట. ఆ తెల్లజాతి విదేశీ వృద్ధుల ఉత్సాహం చూస్తుంటే ఈ దేశ సంస్కృతిపట్ల ఎంత పిచ్చి వీళ్లకి అనిపించింది.

వాళ్లలో ఆ లావాటామె అమెరికా జాతీయురాలు. బక్కపల్చగా, పొడవుగా ఉన్న రెండో ఆమె బ్రిటిషర్‌ట. ఈమెగారే త్యాగరాజు భక్తురాలు. ఇద్దరూ చీరలు కట్టుకున్నారు. ఆ లావాటామె నుదుట కుంకుమబొట్టు పెట్టుకుంది. వాళ్లిద్దరూ పదిరోజులు ఓ హోటల్‌లో ఉండి ఇప్పుడు రెండు నెలల కోసం లాసన్స్ బే దగ్గర ఓ అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకున్నారట. వాళ్లకు సత్యమూర్తి గైడ్.

అదే తొలిసారి సత్యమూర్తి ఉంటున్న రెండుగదుల అద్దెకొంపని చూడటం. కృష్ణనగర్‌లో ఓ పాతకాలపు పెంకుటిల్లు. సత్యమూర్తికి విశాఖపట్నం బొత్తిగా కొత్తకాదట. అతడు పుట్టటం ఈ ఊళ్లోనేనట. అతడి బాల్యం ఇప్పుడు అతడుంటున్న ఈ కృష్ణనగర్‌లోనే గడచిందట. అయితే, తలిదండ్రుల బదిలీల వల్ల ఆరోఏట సత్యమూర్తి కుటుంబం విశాఖపట్నం విడిచిపెట్టి వెళ్లి పోయిందట. దాదాపు గత

రెండున్నర దశాబ్దాలు విజయవాడ, ఏలూరు, హైదరాబాదుల్లో గడచిందట. ఇప్పుడు తల్లీ, తండ్రీ తన పెద్దన్నయ్య దగ్గర ఏలూరులో ఉంటున్నారట. ఆ రకంగా సత్యమూర్తికి కొత్త విశాఖపట్నం కన్నా పాత విశాఖపట్నం అంటేనే ఇష్టమట.

విశాఖపట్నం అందం విశ్వరూప సాక్షాత్కారం కావాలంటే కలెక్టరాఫీస్ బంగ్లా మొదటిఅంతస్తునించి సముద్రాన్ని చూడాలి. మహారాణిపేట కొబ్బరిచెట్ల పచ్చదనంతో కలిసిపోయే నీలంసముద్రం, ఆ వెనక తేజోవంతమైన అనంతాకాశం కనిపిస్తాయి. ఆ దృశ్యం అపురూపం. మన ఆత్మల్లో ఏళ్ల తరబడి పేరుకుపోయిన క్షుద్రత్వాన్ని కడిగేసే జలపాతంలాంటి అందం. మరో ఐదారేళ్లలో అంతస్తుల మహాభవనాలు ఆకాశానికి లేచిపోయి, ఈ అద్భుత సౌందర్యదృశ్యాన్ని తుడిచిపెట్టేస్తాయని అతడి ఆందోళన. విశాఖపట్నం పరిసర ప్రాంతాల అందాల గురించి కవిత్వం చదువుతున్నట్టుగా ఉంటుంది సత్యమూర్తి మాట్లాడుతుంటే.

అవును, విశాఖపట్నం మరో పదేళ్లలో ఏమవుతుందో ఎవరూ ఊహించేట్టు లేదు. రాక్షసికోరలతో పెరుగుతున్న పరిశ్రమలను చూస్తే నాకూ భయంగానే ఉంది. కనీసం భూగర్భమురుగునీటి పారుదల సదుపాయం కూడా లేని ఈ వర్ధమాననగరం నెత్తిపైన కాలుష్యం భస్మాసురహస్తమవు తుందన్నది సత్యమూర్తి భయం.

తార రెండు మూడుసార్లు సత్యమూర్తి గురించి గుర్తు చేసుకున్న సంగతి చెప్పాను. ఆ రోజు మొట్టమొదటిసారి మా ఇంటికి వచ్చినప్పుడు సత్యమూర్తి ఓ గంటసేపు, తారగాని, అక్కడున్న ఇతరులుగాని పెదవి విప్పకుండా మాట్లాడాడట. అది తార నోట విన్నప్పుడు నాకు నమ్మశక్యం కాలేదు ఆ విషయం చెప్పినప్పుడు సత్యమూర్తి నవ్వి ఊరుకున్నాడు.

వాళ్లను మా ఇంటికి తీసుకువెళ్లాను. కాఫీ తాగి వెళ్లమంటే సంతోషంగానే ఆమోదించారు ఆ ముసలమ్మలు. అయితే, వాళ్లు ముగ్గురూ మాట్లాడుకున్న విషయాలు నాకేమీ అర్థంకాలేదు. రెండు రోజుల క్రితం రవీంద్రరెడ్డి శిల్పాలు చూశారట. ఆ శిల్పాల గురించి, సంగీతం గురించి, చిత్రలేఖనం గురించి వాళ్లల్లో వాళ్లు ప్రశంసలతో మాట్లాడుకున్నారు. ఆ ప్రపంచం నాకు కొత్త కావటంతో నేను వాళ్లతో మాటకలపలేకపోయాను. తార ఢిల్లీ వెళ్లినట్టు సత్యమూర్తికి తెలిసినట్టే ఉంది.

వయసులో సత్యమూర్తి నాకన్నా కనీసం ఇరవై పాతికేళ్లన్నా చిన్నవాడు కావచ్చు. కానీ, మానసికంగా అతడి ఎదుగుదల చూస్తే ఈ వయోభేదం తారుమారు అవుతుందనిపించింది.

తార ఢిల్లీ వెళ్లి వాళ్ల బాబాయి సలహాసంప్రతింపులకు విరుద్ధంగా అన్నీ

తలకిందులు చేసి వచ్చింది. ఇదివరకు మీ ఇష్టం, మీ ఇష్టం అన్నదల్లా ఇప్పుడు ఆ పెళ్లి సంబంధం తిరస్కరించి వచ్చింది. మా తమ్ముడు శ్రీకాంత్ హోదా, పదవీ చూసి వాళ్లు ఈ సంబంధం పట్ల ఆసక్తి చూపారే కానీ, మా హోదాని చూసి మాత్రం కాదు. ఆ యువకుడు స్టేట్స్‌లో సంపాదించే డాలర్ల మీద మోజుతో మేము ఈ సంబంధాన్ని కోరలేదు. తార చదువుకు తగిన హోదా ముఖ్యమనిపించి, అన్ని విధాల ఆ కుర్రవాడు యోగ్యుడనిపించింది. శ్రీకాంత్ ఫోన్‌చేసి చెప్పినప్పుడే తారతో మాట్లాడాను. స్టేట్స్‌లో జీవితాంతం బతకాలన్న ఆలోచన తనను భయపెట్టిందని కచ్చితంగా చెప్పేసింది. మీరు ఈ దేశం తిరిగి ఎప్పుడు వచ్చేస్తారని ఒకే ఒక ప్రశ్న అడిగిందట ఆ అబ్బాయిని. తన తలిదండ్రులు అక్కడే స్థిరపడిపోయారు కనుక తనకు ఈ దేశం తిరిగి రావాలన్న ఆలోచనలేదని ఆ యువకుడు నిర్ద్వందంగా చెప్పాడట. అక్కడ తెగిపోయింది వ్యవహారం. అతడి ఆలోచనాధోరణి తారకు నచ్చలేదట. శ్రీకాంత్ ఆ అబ్బాయి గురించిన ఈ వివరాలన్నీ ముందుగా చెప్పినవే. అప్పట్లో తార ఈ అభ్యంతరం  ఎందుకు చెప్పలేదో మాకు అర్థం కాలేదు. సత్యమూర్తి ప్రభావం ఏమన్నా తారమీద పడిందా అన్న సందేహం మనసు అట్టడుగుపొరల్లో కదలటం ప్రారంభించింది.

ఈ సంబంధం స్థిరపడినట్టు బంధువుల్లో, స్నేహితుల్లో ప్రచారం కావటంతో మాకు అవమానంగా, ఇబ్బందిగా ఉంది. అమ్మాయికి నచ్చలేదని చెప్పుకోవాల్సి వస్తున్నది. అయితే,తార ఇవేవీ దృష్టిలో పెట్టుకోకుండా ఏమీ జరగనట్టే ప్రవర్తిస్తున్నది. మరి అట్లాంటి పరిస్థితిలో సిటీబ్యాంక్ ఆహ్వానించి ఇచ్చిన ఉద్యోగం తిరస్కరించటం దేనికి? ఈ దేశంలో ఉండబోవటం లేదన్న ఉద్దేశంతోనే కదా? మా చిన్నమ్మాయి మాలతి చదువు మధ్యలో మానేసి పెళ్లికి తొందరపడినప్పుడు దాని ధోరణి మాకు అప్పుడు నచ్చలేదు. అక్కని ఆదర్శంగా తీసుకుని బుద్ధి తెచ్చుకోమని హితబోధ చేశాం. ఇప్పుడనిపిస్తున్నది, మాలతి నిర్ణయమే సరయిందని. భర్తతో ఇప్పుడు ఇంగ్లండులో ఇద్దరు పిల్లలతో సంతోషంగా ఉంది. రెండుసార్లు మేము వెళ్లివచ్చాంకూడా.

ఇది ఇట్లా ఉండగా ఒకానొక ప్రముఖ వారపత్రిక సత్యమూర్తి దేవరకొండ కథ 'మహానగరం' వచ్చే వారం వస్తున్నట్టు ప్రకటించింది. ఆ రోజుల్లోనే సత్యమూర్తి ఓసారి స్నేహితుల పనిమీద బ్యాంక్‌కి వచ్చాడు. ఒక స్నేహితునికి బంగారం మీద అప్పు, ఒక సాంస్కృతిక సంస్థకు విరాళాల సేకరణ, నాగరాజు కొత్త ప్రయోగాత్మక నాటకానికి టికెట్ల అమ్మకం — ఈ మూడు పనులు ఓకేసారి చేసుకుని వెళ్లాడు. కానీ,

తన కథ వచ్చే వారం పత్రికలో వస్తున్న సంగతి మాత్రం మాటమాత్రంగానన్నా చెప్పలేదు.

సత్యమూర్తి కథ 'మహానగరం' పత్రికలో మధ్యపుటల్లో ప్రముఖంగా వచ్చింది. కథ నాకు నచ్చలేదు. జుగుప్స కలిగించింది. చేదు మందు తిన్నట్టుంది.

బాంబే నేపథ్యం. ఓ సంపన్న వాణిజ్యవేత్త కూతురు ప్రసవ సమయంలో చచ్చిపోతుంది. తనదగ్గర పని చేసేవాడి భార్య, తన పసిమనువరాలికి పాలుపెట్టేలా, ఆ వాణిజ్యవేత్త ఒప్పందం కుదుర్చుకుంటాడు. దాదాపు పదినెలలు వయసున్న తన కొడుక్కి పాలు లోటు చేయకుండానే రెండో బిడ్డకు సరిపడే పాలు ఉన్నందున ఆ నిరుపేద పడుచుతల్లి ఒప్పుకుంటుంది. వాళ్ళను తన ఔట్‌హౌస్‌లో ఉండమని యజమాని మరో సదుపాయం అడుగుతాడు. ఆమె ఇష్టపడదు. పసిపాపాయికి పాలు ఇవ్వటానికి వెళ్లినప్పుడు తన కొడుక్కి పాలు దొంగతనంగా ఇచ్చుకోవటం ఆమెని కలవరపరుస్తుంది. వాళ్లు తన ఔట్‌హౌస్‌లో ఉండనందుకు యజమానికి కోపం. ఓ ఉదయం ఆమె కొడుకు ఆ మురికివాడలో తప్పిపోతాడు. ఎవరో ఎత్తుకుపోయారనే వదంతి ప్రచారమవుతుంది. ఆ వెతుకులాటలో పడి ఓ పూట ఆమె పాలు ఇవ్వటానికి వెళ్లలేకపోతుంది. దాంతో ఉగ్రుడయిన యజమాని ఆమె ఉంటున్న గుడిసెకు వచ్చి పాలు పిండుకుని వెడతాడు. మగని కండ్లముందే ఈ దౌర్జన్యం జరిగినా అతడు నోరు విప్పడు. అప్పటికే మొగుడు మూడు నెలల జీతం యజమాని నించి ముందుగా తెచ్చుకున్నాడు. దానికితోడు ఔట్‌హౌస్‌లోకి పోదామని పోరు. దాంతో ఆ పడుచుతల్లి మొగుణ్ణి వదిలేసి, పిల్లవాణ్ణి చంక నెత్తుకుని తన కన్నవారింటికి పల్లెటూరు పారిపోతుంది. ఇదీ క్లుప్తంగా కథ.

మానవతా సౌందర్యభావనని తుంగలో తొక్కేసి రాసిన కథ. 'మహానగరం' అన్న కథ రాసినవాడు గనక ఈ సత్యమూర్తే అయితే, ఈ రచయితను ఇకమీదట గడప తొక్కనీయరాదనుకున్నాను. కథాసాహిత్యంలో మనకు మహా రచయితలు పెట్టిన అపురూపమైన వరవడి ఉంది. అందుకు భిన్నమైన ఈ ధోరణి జాతి సహించరానిది.

'అది నా ముద్ర. జీవితంలో మన చుట్టూ ఉన్న జుగప్సను పువ్వుల్లో పెట్టి చూపటం ఆత్మవంచన. భ్రష్టజీవుల దారిద్ర్యానికి అందాల తొడుగులు తొడగడం నాకు చేతకాదు. అందుచేత ఆ సాహిత్యపు పోకడలు నాకు సరిపడవు. నాది కొత్తతరం' అన్నాడు సత్యమూర్తి. ఆ కథమీద పాఠకుల అభిప్రాయం విని బుద్ధి తెచ్చుకుంటా దనుకున్న రచయిత ఎదురుతిరిగేసరికి దిక్కుతోచలేదు నాకు. "భావదారిద్ర్యం నించి సాహిత్యం పుష్పించదు. భావ జలపాతంగా రచయిత

సాహిత్యంలో అడుగు పెట్టాలి. అది నా సంకల్పం" అన్నాడు. ఆ వాక్యాలు విన్నప్పుడు సానిదానికి మాత్రం నీతి ఉండొద్దా అన్న మధురవాణి మాటలు నాకు గుర్తొచ్చాయి.

నా అభిప్రాయం తప్పు కావచ్చునని, లేదా రచయితలకు సహజసిద్ధమైన రాగద్వేషాలతో ఏర్పడిన నిష్కారణమైన ఈర్ష్యాసూయలు కావచ్చునని ఆత్మవిమర్శ చేసుకుని అయిదారుగురు తోటి రచయితలకు ఆ కథ గురించి చెప్పి చదవమన్నాను. ఒకరిద్దరికి నా పత్రికనే బదులు ఇచ్చి వారితో చదివించాను.

వాళ్లంతా ఆ కథను ఏకగ్రీవంగా తిరస్కరించారు. ఆ రచయితను క్షమించ కూడదన్నారు. క్షుద్రసాహిత్యం తర్వాత ఇంకా మరింత ప్రమాదకరమైన జబ్బు తెలుగు కథాసాహిత్యాన్ని పట్టుకుంటున్నదన్న ఆవేదనతో ఆ రచయితను విమర్శిస్తూ సంపాదకునికి ఉమ్మడిగా నిరసన లేఖ రాశారు.

అయితే, రచనలో బలం ఉంది. మొదటి వాక్యం ముట్టుకుంటే చాలు పాఠకుడిని విడిచిపెట్టదు. ముగించాకా మనసులో సంక్షోభం. వాక్యంలో పదునుంది. శిల్పంలో పటుత్వం ఉంది. భాషలో చేవ ఉంది. భావనలో ఆదర్శ తీవ్రత ఉంది. అవగాహనలో నిర్దుష్టత ఉంది. అక్షరంలో సూనృతం ఉంది. కథ నడిపించగల ఒడుపు తెలిసినవాడు. సమాజంలో క్షుద్రత్వం మీద పిడుగులు కురిపించగల సత్తా ఉంది. ఇప్పుడున్న సాహితీస్తబ్ధతను ఇతడు బద్దలు కొట్టగలడని మాత్రం అందరూ ఒప్పుకున్నారు.

అయితే, ఆ కథలో ప్రతి అక్షరంలో జుగుప్స, బీభత్సం, బర్రెపాలు పిండినట్టు ఆ పదుచుతల్లి పాలు ఆ యజమాని పిండటం నూటికి నూరుపాళ్లు అసహజం. ఏ యువతీ దాన్ని భరించదు. రచయిత మనో వైకల్యానికి ఇది తిరుగులేని సాక్ష్యం.

తర్వాత నేను సత్యమూర్తిని కలుసుకోవటం మానేశాను.

అయితే, సత్యమూర్తి నన్ను వదల్లేదు. అతడి స్నేహపాత్రత ముందు నా పట్టుదల ఓడిపోయింది.

ఇట్లాంటి మానసిక వైపరీత్యం ఈ రచయితకు ఏర్పడటానికి అతడి జీవితనేపథ్యం ఏమిటా అన్నది నన్ను కలవరపరచటం మొదలుపెట్టింది. ఆ భూమికను పరిశీలిస్తేనే తప్ప ఆ కథ వెనక ఉన్న జీవితం అర్థం కాదనిపించింది.

'మహానగరం' కథ చదివిన తర్వాత సత్యమూర్తి పట్ల ఏర్పడిన విముఖత్వం క్రమంగా తగ్గుముఖం పడుతున్న సమయంలో సిరిపురం జంక్షన్ సమీపంలో నాగరాజు ప్రదర్శిస్తున్న ప్రయోగాత్మక వీధినాటకం దగ్గర సత్యమూర్తితో తార కనిపించింది. వాళ్లతో తొంభైఏళ్ల ముసలాయన అప్పలస్వామిగారు ఉన్నారు. ఆయన

తెలుగు సాహిత్యంలో పాతకొత్తల వారధి. నాలుగుతరాల రచయితలకు అప్పుడు. తెలుగుదేశంలోని మారుమూల పల్లెటూళ్ళలో సైతం ఉన్న నిన్న మొన్నటి తొలితరం కథారచయితలను కూడా ఆయన ఎరుగును. బెంగాలీ, ఒరియా, హిందీ భాషల నించి, సంస్కృత గ్రంథాలనించి ఆయన చేసిన అనువాదాలు, ఆయన స్వతంత్ర రచనలు — ఆయన్ని సాహిత్యంలో వైతాళికునీ, వేగుచుక్కనీ చేశాయి. ఆయన్ని ఎప్పుడో నేను కథలు రాస్తున్న రోజుల్లో దాదాపు ఇరవైఏళ్ల క్రితం తరచు కలుసుకునేవాడిని. ఆయన అభిప్రాయాలు అమూల్యంగా ఉండేవి. తర్వాత ఆయన్ని కలుసుకోవటం తగ్గిపోయింది. చాలా రోజుల తర్వాత ఇప్పుడిక్కడ ఆయన్ని చూడటం.

నాకా దృశ్యం విడ్డూరంగా తోచింది. పొరపడ్డానేమోనని మరోసారి పరీక్షగా చూశాను. తార నాటకం తిలకించటంలో తన్మయురాలయింది. తార ఏమిటి? ఈ వీధి నాటకాలవాళ్ల గుంపులో కనిపించడమేమిటన్న విభ్రాంతితో సతమతమవు తున్నాను నేను. తారను నేను అట్లా పెంచలేదు. ఢిల్లీలో వాళ్ల బాబాయి దగ్గర ఉండి కిండర్‌గార్డన్ నుంచి డిగ్రీ వరకు చదువుకుంది. ఆమె మిరాండా కాలేజీలో స్టూడెంట్ యూనియన్ సెక్రెటరీ. తర్వాత అహ్మదాబాద్ ఐ.ఐ.ఎమ్‌లో ఎమ్.బి.ఎ చేసింది. ఎమ్.బి.ఎ రెండో ఏడాదిలో ఉండగానే ఆమెకి విదేశీ కంపెనీలలో పెద్ద హోదాఉద్యోగాలు వెతుక్కుంటూ వచ్చాయి. ఆరునెలల కిందటే తార స్టేట్స్ వెళ్లిపోవలసింది. పెళ్లి ఈ దేశంలో చేసి బంధుమిత్రులతో సంతోషం పంచకోవాలన్న మా ఆశ మూలంగా వాయిదావేయటంతో ఈ కొత్త పరిణామాలు. చిన్నమ్మాయి మామీద ఎదురు తిరిగి చేసుకున్న పెళ్లికావటంవల్ల ఈ పెళ్లినన్నా ఘనంగా చేయాలనుకున్నాం.

మా ఆలోచనలన్నీ తలకిందులైనట్టు తెలుస్తూనే ఉంది. ఈ సంగతి జానక్కి తెలిస్తే తట్టుకోలేదు. నా భయాలన్నీ అబద్ధాలు కాకూడదా? తార అక్కడ సత్యమూర్తిని కలుసుకోవటం యాదృచ్ఛికం కాకూడదా? తారకోసం నాగరాజు ఫోన్ చేయటంలో అర్థం ఇప్పుడు తెలుస్తున్నది. ఆ మధ్య దుండగులు నాగరాజు ప్రదర్శనను భగ్నం చేసి అతణ్నీ, నటుల్నీ కొట్టినప్పుడు తార రాత్రి చాలా పొద్దుపోయిన తర్వాత ఇల్లు చేరుకోవటం— తీగెలాగితే డొంకంతా కదిలినట్లయి నన్ను కలతపరచింది. తార తన రెండేళ్ల హాస్టల్ జీవితంలో ఎంతో నిబ్బరంగా వ్యవహరించిందన్న ధైర్యం, గర్వం, తెలివితక్కువగా తార వ్యవహరించబోదన్న నా గట్టి నమ్మకం కూడా ఆ సమయంలో నన్ను శాంతపరచలేకపోయాయి. నెలదినాల కిందట తార ఢిల్లీ వెళ్లి ఖాయమైపోయిన

సంబంధాన్ని తోసిపుచ్చి రాకపోతే నాకీ అనుమానాలు వచ్చేవే కావు.

నేను అనుకున్నంతా జరిగింది. ఆ రాత్రి జానకీ నేనూ తారతో పెళ్లి గురించి మాటాడినప్పుడు "పెళ్లికన్నా ముఖ్యమైన కార్యకలాపాలు చాలా ఉన్నాయమ్మా మన జీవితాల్లో" అంది. నాకు గుండె ఆగిపోయినంత పనయింది. జానకే నయం. తట్టుకోగలిగింది. అయితే, జానక్కి సిరిపురం జంక్షన్ ఉదంతం తెలీదు. నేను చెప్పలేదు.

"అంటే?" జానకి...

'జీవితంలో మనం చేయతలపెట్టిన మంచి పనులకు పెళ్లి శత్రువు. పెళ్లి చేసుకుని పిల్లల్ని కనటానికే అయితే, ఈ చదువులు చదువుకోవటం దండుగ." అంది తార.

ఇప్పుడు నాకు చాల స్పష్టం — ఇది సత్యమూర్తి భాష.

సత్యమూర్తి కొత్తగా రాసిన నాటకం ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలని నిశ్చయించుకున్నట్టు చెప్పి, తనకు సాంస్కృతికరంగంలో అడుగుపెట్టాలని ఉందని తన నిర్ణయం ప్రకటించింది తార. మహానగరాలలో కోటీశ్వరుల బిడ్డలు, పారిశ్రామికవేత్తల భార్యామణులు ఇట్లాంటి సాంస్కృతిక కార్యకలా పాలను చేపట్టటం మామూలే. ఆర్ట్ గేలరీలు, థియేటర్లు, హస్తకళా ప్రదర్శనలు, జానపద కళలు, ఆదివాసీ సంస్కృతి పునరుద్ధరణ మొదలయినవి వాళ్ల విలాసాల్లో ఒక భాగం. అయితే, వాళ్లు వాటిని వాణిజ్యపరంగా జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థలతో సంబంధాల కోసం, హోదాలకోసం, పలుకుబడికోసం, ఆ స్థాయి విలాస జీవితంకోసం చేస్తారు. ఇక్కడే తార తప్పటడుగు వేస్తున్నది. ఇది తన సామాజిక బాధ్యత అంటున్నది. ఈ మహానగరంలోని తిమింగిలాల సంగతి తెలీక తార ఇందులోకి అడుగుపెడుతున్నది. ఇది ఎంత ప్రమాదకరమైన సమస్యో నాకు తెలుసు. కొన్నాళ్లకు తారకు ఈ ఇల్లు నచ్చక పోవచ్చు. మేము ఆమె మేలు కోరేవాళ్లం కాకపోవచ్చు. ఎప్పుడూ ఊహించని రీతిలో ఎదురయిన ఈ సమస్యకు ఏ పరిష్కారమార్గమూ కనిపించలేదు. జానకి కన్నీళ్లు పెట్టుకుంది. తారలో తిరుగుబాటుధోరణి భరించగల గుండెదిటవు జానక్కి లేదు.

రెండు వారాలు మేము ఆఫీసులకు సెలవు పెట్టాల్సివచ్చింది. జాతకం తీసి చూపించాం. తార వివాహయోగం బలంగానే ఉందని జ్యోతిష్కులు చెబుతున్నారు. కంచి వెళ్లి పరమాచార్యవారి అనుగ్రహం పొంది, వారితో మా ఆవేదన నివేదించుకున్నాం. పుట్టపర్తి వెళ్లి మేము తట్టుకోలేని సమస్యకు మానెత్తిన పెట్టవద్దని

భగవాన్‌ని ప్రార్థించాం. మా పూజ్యగురువర్యులవారిని ఈ ఆపదనించి కూడా మమ్మల్ని రక్షించమని వేడుకున్నాం. చివరకు నాకు ఒకే పరిష్కార మార్గం తోచింది. సత్యమూర్తితో అరమరికలు లేకుండా హృదయం విప్పి సమస్య గురించి మాట్లాడటం. జానకీ నేనూ వెళ్లి అతనితో మాట్లాడాలనుకున్నాం.

అది నాలుగోసారి సత్యమూర్తికోసం వెళ్లటం. మొదటిసారి వెళ్లినప్పుడు స్నేహితులతో అరకు వెళ్లాడన్నారు. ఇంకోసారి కనుక్కుంటే ఢిల్లీ వెళ్లాడన్నారు. మరోసారి ఊళ్లో ఉన్నాడు కాని, ఎప్పుడొస్తాడో తెలీదన్నారు.

కిందపరచిన పరుపుమీద కూర్చుని రాసుకుంటున్న సత్యమూర్తి నన్ను చూసి కలం పక్కకు పెట్టి లేచి సంతోషంతో ఎదురువచ్చాడు. గది చాలా విశాలంగా ఉంది. కూర్చోవటానికి గదిలో కుర్చీలు ఏమీ లేవు. పెద్దపరుపు. దానిమీద అందమైన బొమ్మల దుప్పటి, చేరగిలబడి కూర్చోటానికి వీలుగా గోడకి అమర్చిన పెద్ద పెద్ద దిండ్లు. అలమరా నిండా పుస్తకాలు. బిస్మిల్లా ఖాన్ షెహనాయ్.

చల్లని చలికాలపు వెలుతురు.

ఆ గదిలో తైలవర్ణచిత్రాలు నన్ను ఆకర్షించాయి. వాటి గురించి అడిగాను. ఆ మూడు చిత్రాలు తన స్నేహితులవట. పత్రికలో పనిచేస్తున్న రోజుల్లో కొనుక్కున్నాడట. వాళ్లలో ఒక చిత్రకారుడు ఇప్పుడు తన పెయింటింగ్‌లను ఊహించలేనంత పెద్ద మొత్తానికి అమ్ముతున్నాడట.

సత్యమూర్తి జానకిని చూడటం ఇదే తొలిసారి. ఆదరంగా నమస్కారంతో పలకరించి మమ్మల్ని లోపలికి తీసుకుపోయి పరుపు మీద కూర్చోబెట్టాడు.

"అమ్మకి ఉత్తరం రాస్తున్నాను, మీరొచ్చారు."

ప్రియురాలికి ఉత్తరం రాస్తున్నాను అనాల్సిన వయసులో అమ్మకు ఉత్తరం రాస్తున్నానన్న అతడి వాక్యం నా చెవికి ఇంపుగా వినిపించింది.

"మా అమ్మకి నా రచనలు చాలా ఇష్టం. చాలా మంచి ఉత్తరాలు రాస్తుంది. నా రచనలో తప్పులూ, ఒప్పులూ చూపి తన అభిప్రాయం రాస్తుంది. నా మొట్టమొదటి పాఠకురాలు, విమర్శకురాలు మా అమ్మే. దాంతోపాటు స్వాతంత్ర్యపోరాటకాలంనాటి తన అనుభవాలు, జైలు జీవితం, అనాటి నాయకుల త్యాగాలు సాహసాల గురించి రాస్తుంది. నేను నా ఉత్తరాల్లో విశాఖ అందాల గురించి పేజీలు నింపుతాను."

సత్యమూర్తి పేర్లో ఔచిత్యం అప్పుడు నాకు స్ఫురించింది.

గదిలో తేలియాడుతున్న సంగీతాన్ని ప్రస్తావిస్తూ "బిస్మిల్లా ఖాన్‌తో కూర్చున్నారా?" అన్నాను.

"ఖాన్ సాబ్‌కి నా వ్యాసం చాల నచ్చింది. ఆయనతో వారణాశిలో రెండు రోజులు గడిపి వచ్చేస్తుంటే గుర్తుగా ఇచ్చిన బహుమతి ఇది. పత్రికలో పని చేసిన ఆ రెండేళ్లూ మా సంపాదకుడు నన్ను గట్టిగా సానపట్టాడు. సంగీతం, చిత్రకళ, రంగస్థలం, సాహిత్యం నాకు ఇష్టమైన రంగాలని గ్రహించి పెద్ద పెద్ద వాళ్లతో ఇష్టాగోష్ఠి కార్యక్రమాలకు నన్ను పంపించేవాడు. పిట్టలా ఉన్న నన్ను చూసి వాళ్లు నీరసించి పోయేవాళ్లు, నిరుత్సాహపడే వాళ్లు, నాకే సిగ్గనిపించేది. అయితే, చివరికి సాగనంపేటప్పుడు మళ్లీ ఎప్పుడొస్తావు అని ప్రోత్సహించి, బాంబే వచ్చినప్పుడల్లా నన్ను పిలిపించుకునేవాళ్లు. వాళ్ల అభిమానం నన్ను చివరికి ఇటువేపు తిప్పింది. సృజనాత్మకరంగానికి అంకితం కావాలను కున్నాను."

ఈ ముచ్చట్లు సాగుతుండగా అప్పలస్వామిగారు వచ్చారు. "సత్యమూర్తి, నీ కొత్త కథ 'మహానగరం' చదివానయ్యా. కథలట్లా రాయాలి. నన్ను నీ అభిమానిని చేసేసుకున్నావ్. పత్రిక వచ్చిన చాలా రోజులకి చదివానులే. వారం పదిరోజుల్నించి అనుకుంటున్నాను, కలిసి నిన్ను అభినందించిపోవాలని. ఈ లోపల ఓసారి మదనపల్లె వెళ్లాల్సివచ్చింది. ఈ కథలో మహానగరానికి ప్రతీకగా ఆ సేఠ్‌ని చూపడం నాకు నచ్చింది. అవును, పల్లెటూళ్లని ఇప్పుడు ఈ మహానగరాలు తినేస్తున్నాయి. నీ వన్నది నిజం. వర్తమాన సమాజంలోని క్షుద్రత్వం మీద జుగుప్స కలిగించలేని సాహిత్యం సాహిత్యమే కాదు. కుండబద్దలు కొట్టినట్టు చెప్పావులే. ఆ ప్రతీకలు సలక్షణంగా కుదిరాయిలే. కొన్ని చోట్ల భావతీవ్రత కవిత్వమయమయింది. ఆ హద్దు దాటి పోయిందా కథకు కవిత్వ గుణం బరువుతుంది, జాగ్రత్త. గొప్పగా రాసేవులే. ఇల్లాంటి కథలు ఇంకా ఇంకా రావాలి" అని ఆయన బయటనే నుంచుని "స్నేహితులు వచ్చినట్టున్నారు. నువ్వు ఉండు. చాలా రోజులయింది ఇంటికి వచ్చి. ఓసారి తీరిగ్గా రా. నేవెళ్తాను. ఆం —అన్నట్టు ఆ పత్రికకి ఒక ఉత్తరం రాశాను, ఈ మధ్య నేను చదివిన మంచి కథల్లో నీ కథ మరీ మంచిదని" అని ఆయన చేతికర్ర ఊపుకుంటూ వెళ్లిపోయారు. గేటువరకు వెళ్లి సత్యమూర్తి ఆయన్ని సాగనంపి తిరిగి వచ్చాడు.

నాకూ, నా ఇతర రచయిత మిత్రులకూ అంత జుగుప్స కలిగించిన కథ అప్పలస్వామిగారి లాంటి రుషితుల్యుడయిన సారస్వతమూర్తికి నచ్చింది. ఆ కథలో ఆయన చెబుతున్న ప్రతీకలు ఎక్కడున్నాయో నాకయితే అర్థంకాలేదు. ఆ కథ వెనక ఒక సందేశం ఉన్నట్టు కూడా నాకు ధ్వనించలేదు. ఇన్ని అందాలు ఆ కథలో నిజంగానే ఉన్నట్టా? నాకు పెద్ద గాయం తగిలినట్టుగా ఉంది. మనసు మీద జడత్వం

పేరుకుపోతున్నట్టు అనిపించింది. హృదయం కరుడుకట్టుకుపోవటం అంటే ఇదేనా?

తార గురించి ఎన్నో విషయాలు సత్యమూర్తితో మాట్లాడాలను కున్నాను. నా నోటి నుంచి రాని ఎన్నో ప్రశ్నలకు సత్యమూర్తి ముఖంలో సమాధానాలు కనిపించాయి. నా నోరు ఇప్పుడు మూతపడింది.

కథలు రాయటం ఎందుకు మానేశారన్న ప్రశ్న మరోసారి సత్యమూర్తి నన్ను అడగకపోవటానికి కారణమేమిటో ఇప్పుడు బోధపడుతున్నట్టుగా ఉంది.

* * *

*సెప్టెంబర్ 1992 ఇండియాటుడే*